# శాప ప్రకరణం

952. హజ్రత్ సహెల్ బిన్ సాద్ సాది (రజి) కథనం:- హజ్రత్ ఆసిమ్ బిన్ అదీ అన్సారీ (రజి) దగ్గరకు హజ్రత్ ఉవైమిర్ అజ్లానీ (రజి) వచ్చి ఇలా అన్నారు: "ఆసిమ్! ఎవరైనా తన భార్య పక్కలో మరో (పరాయి) వ్యక్తి ఉండటం చూస్తే, మీరు ప్రతీకారం (ఖిసాస్)గా చంపినట్లు అతనా వ్యక్తిని చంపవచ్చా చెప్పండి. లేకపోతే  అతనేం చేయాలి? ఆసిమ్! మీరు నా కోసం ఈ సమస్యను గురించి దైవప్రవక్త (సల్లం)ను అడిగి చెప్పండి". అప్పుడు హజ్రత్ ఆసిమ్ (రజి) ఈ సమస్యను దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావించి పరిష్కారం అడిగారు. అయితే ఈ విషయమై హజ్రత్ ఆసిమ్ (రజి) అడిగిన ప్రశ్నలు దైవప్రవక్త(సల్లం)కు నచ్చలేదు. దానిపై దైవప్రవక్త (సల్లం) వ్యక్తపరచిన మాటలు విని హజ్రత్ ఆసిమ్ (రజి)  ముఖం చిన్నబుచ్చుకున్నారు.

ఆ తర్వాత ఆయన ఇంటికి తిరిగొచ్చారు. హజ్రత్ ఉవైమిర్ (రజి) ఆయన్ని చూసి "ఆసిమ్! దైవప్రవక్త (సల్లం) ఏమన్నారు?" అని అడిగారు. "నువ్వు నన్ను లేనిపోని వ్యవహారంలో ఇరికించావు. దైవప్రవక్త (సల్లం) నేనడిగిన ప్రశ్న విని అయిష్టత వ్యక్తపరిచారు" అన్నారు హజ్రత్ ఆసిమ్ (రజి). హజ్రత్ ఉవైమిర్ (రజి) అది విని "దైవసాక్షి! నేనీ సమస్య గురించి దైవప్రవక్త(సల్లం)ను తప్పకుండా అడుగుతాను" అని అన్నారు. ఈ మాట చెప్పి ఆయన దైవప్రవక్త(సల్లం) సన్నిధికి వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (సల్లం) ప్రజల మధ్య కొలువు తీరి కూర్చున్నారు. హజ్రత్ ఉవైమిర్ (రజి) ఆయన దగ్గరకు వచ్చి "దైవప్రవక్తా! ఒక వేళ ఎవరైనా తన భార్య పక్కలో పరాయి వ్యక్తిని చూస్తే ఏం చేయాలో చెప్పండి. అతనా వ్యక్తిని చంపవచ్చా? చంపివేస్తే చట్టం ప్రతీకారం (ఖిసాస్)గా తిరిగి అతడ్ని చంపివేస్తుందా? లేకుంటే ఇలాంటి స్థితిలో అతనేం చేయాలి?" అని అడిగారు.  దైవప్రవక్త (సల్లం) ఈ ప్రశ్నలు విని "దేవుడు నీ గురించి, నీ భార్య గురించి ఆజ్ఞ అవతరింపజేశాడు. వెళ్ళి నీ భార్యను ఇక్కడికి పిలుచుకురా" అన్నారు.

హజ్రత్ సహెల్ బిన్ సాద్ (రజి) కథనం:- వాళ్ళిద్దరు (దైవప్రవక్త సన్నిధికి వచ్చి) పరస్పరం 'లిఆన్'★ (శాప ప్రమాణం) చేసుకున్నారు.  ఆ సమయంలో అందరితో పాటు నేను కూడా దైవప్రవక్త(సల్లం) సన్నిధిలో కూర్చొని ఉన్నాను. ఆ తర్వాత హజ్రత్ ఉవైమిర్ (రజి) దైవప్రవక్త (సల్లం)ను సంబోధిస్తూ "దైవప్రవక్తా! నేనిప్పుడు ఆమెను భార్యగా స్వీకరించానంటే, దానర్థం నేనామెపై అపనింద మోపానన్న మాట" అని అన్నారు. అందుచేత ఆయన ఈ విషయంలో దైవప్రవక్త(సల్లం) నుంచి మరో ఆజ్ఞ కోసం ఎదురు చూడకుండా వెంటనే తన భార్యకు మూడు విడాకులు ఇచ్చేశారు.

[సహీహ్ బుఖారీ : 68వ ప్రకరణం - తలాఖ్, 4వ అధ్యాయం - మన్ అజాజ తలాఖుస్సలాస్]

---

★ 'లిఆన్' అనేది అసలు పదం. 'లిఆన్' అంటే పరస్పరం  శపించుకోవడం అని శాబ్దిక అర్థం. షరీఅత్ పరిభాషలో "భర్త తన భార్యపై అక్రమ సంబంధపు నింద మోపి సాక్షులను తీసుకురాలేని పక్షంలో, ఆ భార్యాభర్తలు న్యాయాధికారి సమక్షంలో కొన్ని ప్రత్యేక మాటల ద్వారా సాక్ష్యం పలకడాన్ని 'లిఆన్' అంటారు. ఈ మాటల చివర్లో "సాక్ష్యం పలికే ఈ వ్యక్తి అబద్ధమాడి ఉంటే అతని లేక ఆమెపై దేవుని శాపం పడుగాక!" అనే వాక్యం ఉంటుంది. ఆ తరువాత భార్యాభర్తలు శాశ్వతంగా విడిపోతారు. ఇక ముందెన్నడూ వారిద్దరు పరస్పరం వివాహమాడలేరు.

953. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) పరస్పరం 'లిఆన్' (దూషణ ప్రమాణం) చేసుకున్న వారితో "ఇప్పుడు మీరిద్దరి లెక్క దేవుని చేతిలో ఉంది. మీరిద్దరిలో ఒకరు అబద్ధాల కోరున్నారు" అని అన్నారు. (ఆ తర్వాత ఆయన పురుష ముద్దాయిని ఉద్దేశించి) "ఇప్పుడు నీకు ఈమెతో ఎలాంటి సంబంధం లేదు" అని అన్నారు. ఆ వ్యక్తి "దైవప్రవక్తా! మరి నా సొమ్ము (మహర్) సంగతేమిటి?" అన్నాడు. "ఇప్పుడు నీకు ఎలాంటి సొమ్ము లభించదు. నువ్వు మోపిన నింద నిజమయితే నీవిచ్చిన సొమ్ముకు బదులుగా ఆమె దగ్గర నీవు దాంపత్య సుఖాన్ని అనుభవించావు. ఒకవేళ నువ్వు అపనింద మోపి ఉంటే ఆ సొమ్ము వాపసు తీసుకోవడానికి నీకు అసలే హక్కు లేదు' ' అని తీర్పిచ్చారు దైవప్రవక్త(సల్లం).

[సహీహ్ బుఖారీ : 68వ ప్రకరణం - తలాఖ్, 53వ అధ్యాయం - అల్‌ముత్ అతిల్లతి లమ్ యుఫ్రజ్‌లహా]

954. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) ఒక పురుషుని చేత, అతని భార్య చేత పరస్పరం 'లిఆన్' (దూషణ ప్రమాణం) చేయించారు. పురుషుడు ఆ సందర్భంలో పిల్లవాడు తనవాడు కాదని నిరాకరించాడు. అప్పుడు దైవప్రవక్త(సల్లం) పిల్లవాడ్ని తల్లికి చెందినవాడిగా పరిగణించారు.

[సహీహ్ బుఖారీ : 68వ ప్రకరణం - తలాఖ్, 35వ అధ్యాయం - యల్ హఖుల్ వలదు బిల్ ములాయినా]

955. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) ముందు 'లిఆన్' (దూషణ ప్రమాణం) ప్రస్తావన వచ్చినపుడు హజ్రత్ ఆసిమ్ బిన్ అదీ (రజి) ఆ విషయంలో కొన్ని మాటలు చెప్పి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయన దగ్గరికి ఆయన తెగకు చెందిన ఒకతను వచ్చి "నేను నా భార్య పక్కలో ఎవరో ఓ పరాయి వ్యక్తి ఉండటం చూశాను" అని తెలిపాడు. దానికి హజ్రత్ ఆసిమ్ (రజి) "నేనీ వ్యవహారంలో ఇంతకు ముందే నా నోట వెలువడిన మాటల కారణంగా ఇరుకున పడ్డాను" అని చెప్పి ఆ వ్యక్తిని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తీసుకెళ్ళారు.

అప్పుడు ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లం) ముందు తన భార్య పక్కలో తాను చూసిన పరాయి మనిషిని గురించి వివరాలు తెలిపాడు. అతను ఎర్రగా, బక్కపలచగా, సరళమైన శిరోజాలతో ఉన్నాడు. అతను తన భార్య పక్కలో చూశానని ఆరోపించిన అపరిచిత వ్యక్తి కండలు తిరిగి భారీ కాయంతో బొద్దుగా, చామనఛాయలో ఉన్నాడు. దైవప్రవక్త (సల్లం), "దేవా! నీవే ఈ వ్యవహారంలో వాస్తవాన్ని బట్టబయలు చేయాలి" అని ప్రార్థించారు. చివరికి ఆ స్త్రీ పిల్లవాడ్ని కనగానే నిజం బయటపడింది. పిల్లవాడిలో ఆమె భర్త ఆరోపించిన వ్యక్తి పోలికలే ఉన్నాయి. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ స్త్రీ పురుషుల (భార్యభర్తల) చేత పరస్పరం 'లిఆన్' (దూషణ ప్రమాణం) చేయించారు.

ఈ హదీసు సమావేశంలో కూర్చొన్న ఒక వ్యక్తి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)ని ఉద్దేశించి "దైవప్రవక్త (సల్లం) ఒక స్త్రీ విషయంలో, సాక్షులు లేకుండా ఎవరికైనా రాళ్ళు రువ్వే శిక్ష విధించవలసి వస్తే తానీ స్త్రీకి రాళ్ళు రువ్వే శిక్ష విధిస్తానని అన్నారు కదా! ఆ స్త్రీ ఈమేనా?" అని అడిగాడు. దానికి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) "కాదు. ఆమె మరో స్త్రీ. ఇస్లాం హయాంలో కూడా ఆమె బహిరంగంగా వ్యభిచారం చేస్తుండేది" అని అన్నారు.

[సహీహ్ బుఖారీ : 68వ ప్రకరణం - తలాఖ్, 31వ అధ్యాయం - ఖౌలిన్నబీ (సల్లం) లౌకున్తు రజిమన్ బిగైరి బయ్యినా]

956. హజ్రత్ ముగీరా బిన్ షేబా (రజి) కథనం:- హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ఒకసారి ఇలా అన్నారు. "నేను నా భార్య పక్కలో పరాయి వ్యక్తిని గనక చూస్తే, అతడ్ని ఎలాంటి పరిస్థితిలోనూ క్షమించను. అతడ్ని తప్పకుండా చంపివేస్తాను." హజ్రత్ సాద్ (రజి) పలికిన ఈ పలుకులు దైవప్రవక్త(సల్లం)కు తెలిసి ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు -

"మీరు సాద్ (రజి) పౌరుషం పట్ల ఆశ్చర్యపోతున్నారా? దైవసాక్షి! నేను అంతకంటే ఎక్కువ పౌరుషం కలవాడ్ని. దేవుడు నాకంటే ఎక్కువ పౌరుషం కలవాడు. దేవుడు తనకున్న ఈ పౌరుషం వల్లనే ఆయన అన్ని రకాల అశ్లీల విషయాల్ని అవి బహిరంగమైనవయినా లేదా రహస్యమైనవయినా సరే - నిషేధించాడు. కారణం లేకుండా దేవుడు ఏ పనీ చేయడు. ఈ విషయంలో ఆయన్ని మించిన వారెవరూ లేరు. అందువల్లనే ఆయన తన ప్రవక్తలను(పుణ్యాత్ములను) శుభవార్త అందజేసేవారిగా, (పాపాత్ములకు దైవశిక్షను గురించి) భయపెట్టే వారిగా నియమించి పంపాడు. దేవుని మించిన ప్రశంసపాత్రుడు మరెవరూ లేరు. అందువల్లనే ఆయన (తనను స్తుతించే వారికి) స్వర్గ ప్రవేశం గురించి వాగ్దానం చేశాడు."

**[సహీహ్ బుఖారీ : 97వ ప్రకరణం - తౌహీద్, 20వ అధ్యాయం - ఖౌలిన్నబీ (సల్లం) లాషఖ్స అగ్‌మర్ మినల్లాహ్]**

957. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం:- ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నాకొక మగపిల్లవాడు పుట్టాడు. కాని నల్లగా ఉన్నాడు, నేను ఎర్రగా ఉన్నాను. (ఇది ఎలా సంభవం)?" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "నీ దగ్గర ఒంటెలున్నాయా?" అని అడిగారు. అతను 'ఉన్నాయి' అన్నాడు. "అయితే అవి ఏ రంగులో ఉన్నాయి?" అడిగారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ. "ఎర్ర రంగులో ఉన్నాయి" అన్నాడతను. "వాటిలో ఏదైనా బూడిద రంగు ఒంటెలు కూడా ఉన్నాయా?" అని అడిగారు దైవప్రవక్త(సల్లం). "బూడిద రంగువి కూడా ఉన్నాయి" అన్నాడతను. "మరి ఈ బూడిద రంగు ఒంటెలు ఎక్కడ్నుంచి వచ్చాయి?" ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం). "వాటికి వాటి తాత ముత్తాతలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" సమాధానమిచ్చాడు ఆ వ్యక్తి. "అదే విధంగా నీ కొడుక్కు కూడా అతని తాత ముత్తాతలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది కదా!" అన్నారు దైవప్రవక్త (సల్లం).

**[సహీహ్ బుఖారీ : 68వ ప్రకరణం - తలాఖ్, 26వ అధ్యాయం - ఇజాఅరజబిన ఫిల్ వలద్]**